## వారం వారం కథాప్రభ

# అత్తగారూ - అరవ సంవత్సరాదీ -



ఆ రోజు అరవ సంవత్సరాది పండుగ ! పొద్దుటే రేడియోలో మంగళవాద్యం వినిపిస్తోంది. ఊరంతా కళకళలాడుతోంది.

మా వంటవాడు హడావిడిగా నా దగ్గరకు వచ్చి "అమ్మగారూ ! అమ్మగారూ ! ఈ రోజు తమిళ ఉగాది. టిఫిన్ ప్రత్యేకంగా ఏమైనా చేయమంటారా? మామూలేనా! పెద్దమ్మగారు నిన్ననే చెప్పారు దండిగా టిఫిన్లూ, పిండివంటలూ చేయాల్రా" అని.

"అయ్యగారి కేం కావాలో, చిన్నయ్యగారి కేం కావాలో అడిగి చెయ్యి."


"వారందర్నీ రాత్రే అడిగానమ్మా. అమ్మగార్ని అడగమన్నారు అయ్యగారు. దోసెలూ, కొబ్బరి చెట్నీ, వడలూ చెయ్యమన్నారు చిన్నయ్యగారు."

"అన్నట్లు మా అత్తగారి అక్కగారి అల్లుడుగారు నిన్న హైదరాబాద్ నుంచి వచ్చారే ఆయనగారు టిఫిన్ ఏం తీసుకుంటారో అడగలేదా?"

"అడిగానమ్మా ! ఆయన చెప్పారూ — నాకవన్నీ వద్దు 'బెడ్డూ, బెటరూ, జేమూ' ఉంటే చాలన్నారు. వంటవాడు చెప్పింది విని నాకు ఫక్కున నవ్వొచ్చింది. 'బ్రెడ్'ని బెడ్డు అన్నందుకు.

కొంతకాలం క్రితం ఒక రోజు నేను ఒక పిక్చర్ షూటింగ్‌కు వెళ్లినప్పుడు భోజనాల సమయంలో ఆ పిక్చర్లో యాక్ట్ చేయడానికి వచ్చిన బెంగుళూరు హీరోయిన్ తల్లి దగ్గర ఆ పిక్చర్ ప్రొడక్షన్ మేనేజర్ వచ్చి — "ఏమండీ ! మీ అమ్మాయిగారికి ఏం కావాలో చెప్పండి తెప్పిస్తాను" అని చాలా మర్యాదగా అడిగాడు.

డా॥ పి. భానుమతీ రామకృష్ణ



"ఒక్కటే వద్దు ! మా అమ్మాయికి ఒక్క 'బెడ్డు' ఉంటే చాలు !"అన్నది హీరోయిన్ తల్లి. అది విన్న నేనూ, పక్కన ఉన్నవాళ్లూ బలవంతంగా నవ్వాపుకున్నాం. హీరోయిన్ తల్లి చెప్పింది అర్థంకాని ఆ ప్రొడక్షన్ మేనేజర్ వెలవెలబోతూ.

"ఒక్క బెడ్డు చాలామ్మా ! రెండు తెప్పించేదా?" అని అడిగారు.

"మా అమ్మాయికి పెద్ద 'బెడ్డు' ఒకటి చాలు. ఇద్దరికీ సరిపోతుంది." ఈసారి ఆపుకోలేక చుట్టూ ఉన్న వాళ్లు గొల్లున నవ్వేశారు. అప్ప

టిక్కాస్త అర్థం అయిన ప్రొడక్షన్ మేనేజర్ నవ్వు బిగపట్టుకుని — "అమ్మా ! నే నడిగేది 'లంచ్' భోజనం మీ అమ్మాయిగారు ఏం చేస్తారూ అని."

"అదేనయ్యా నే చెప్పిందీ ! మా పిల్లకిఒక్క 'బెడ్డు'ంటే చాలన్నానుగా."

"ఓ ! మీ అమ్మాయికి 'బెడ్డుం'టే చాలా" అంటూ నవ్వుకుంటూ వెళ్లాడు ప్రొడక్షన్ మేనేజర్.

అక్కడున్న వాళ్లు నవ్వడం చూసి హీరోయిన్ తల్లి కాస్త కోపంగా "ఏం ! ఎందుకు వాగుతారు? మీ రంతా 'బెడ్డు' తిన్రా" అని అడిగింది.

"బెడ్డు తినేది కాదు ! పడుకునేది" అని మళ్లీ ఒకసారి అందరూ నవ్వడంతో అప్పుడే షాట్ పూర్తి చేసి అక్కడకు వచ్చిన హీరోయిన్ అంతా విని తల్లిని చీవాట్లు పెట్టింది. "ఎందుకమ్మా నవ్వారు"అని అడిగాడు వంటవాడు. "ఏదో గుర్తుకొచ్చి నవ్వాలే. నీకు ఇప్పుడు ఏం కావాలి వంటకి" అని అడిగా.

"కూరగాయలమ్మా ! ఇంట్లో టమాటో కూడా లేదు సాంబారు చేద్దామంటే."

"సరే తెప్పిస్తాలే పనివాణ్ణి పంపి" అని నే నంటూండగానే మా అత్తగారు.

"ఒరే సుందరం !" అంటూ కేకేశారు. వంటవాడు అదిరిపడి "వస్తున్నా పెద్దమ్మగారూ !" అంటూ ఆమె దగ్గరకి చిన్న పరుగు తీశాడు పెరటివైపు.

ఆ రోజు అరవ సంవత్సరాది అయినా మా అత్తగారు మధురాంతకంలో పుట్టి, చెంగల్పట్టులో పెరిగినందువల్లా, అరవ సంప్రదాయం బాగా అలవాటయినందువల్లా, అరవ సంవత్సరాది పండుగ కూడా ఆమె తెలుగు ఉగాది లాగే లెక్కగా జరుపుకుంటుంది.

వంటవాడు సుందరం చేతులు కట్టుకుని, "పెద్దమ్మగారూ ఏం చేయమంటారు వంట !"

"ఏం చేయమని అడుగుతావేమిట్రా? ఈ రోజు ఏం రోజు" అని గర్జించారు.

"షష్టి" అన్నాడు తిథులు లెక్కబెట్టే వంటవాడు.

"షష్టిగాదురా ముష్టీ ! ఈ రోజు అరవ సంవత్సరాదిరా. నా చిన్నతనంలో ఎంతో బాగా జరుపుకునేవాళ్లం చెంగల్పట్టులో. ఎన్ని పిండి వంటలు చేసేది మా అమ్మగారు. ఎన్ని దేవాలయాలకు వెళ్లి వచ్చేవాళ్లం అబ్బో ! ప్చ్."

"మరి తెలుగు సంవత్సరాది పండుగ చేసుకునేవారు కారా?" అరవ దేశాన్ని పొగిడే మా అత్తగారితో.

"ఏదో పెళ్లయ్యాక అత్తగారింటి ఆచారం గనక పండుగ చేసుకునేవాళ్లం. కాని నాకు అరవ సంవత్సరాది పండుగే అలవాటురా. ఆలయాలూ, ఆచారాలూ, అరవదేశంలో ఉన్నట్టు మన ఆంధ్రదేశంలో పాటించడం తక్కువరా. పైగా ఈ కాలం పిల్లలు అసలు పట్టించుకోరు పండగలంటే. అన్నట్టు ఒరే సుందరం, వేప పువ్వు పచ్చడి చేయాల్రా. ముందు చేదూ, తీపీ తినాల్రా ఈ రోజు. ఆ తర్వాతే పిల్లలకి టిఫిన్ ఇవ్వు" అన్నారు మా అత్తగారు తిరుచూర్ణం నామం పెట్టుకుంటూ. ఆమె చెప్పింది విన్న వంటవాడి గొంతులో వెలక్కాయ పడ్డది.

"పెద్దమ్మగారూ ! వేపపువ్వు, కూరగాయల మార్కెట్టులో దొరుకుతుందా" అని అడిగాడు నీళ్లు నములుతూ.

"ఛీ ! ఛీ ! నోర్మూయ్. తాటి చెట్టంత వేప చెట్టు మన ఇంటిముందు పెట్టుకుని వేపపువ్వు కోసం ఎక్కడికో వెళ్లడం ఎందుకురా!"

అది విన్న వంటవాడి గుండెలో రాయి పడ్డది.


"అదిగాదు అమ్మగారూ ! అయ్యగారూ, చిన్నయ్యగారూ అర్జంట్‌గా టిఫిన్ కావాలంటే ఎట్లా? మరి మీరేమో చేదూ, తీపీ అంటున్నారు" అని నసిగాడు వంటవాడు.

"అయితే ముందు నువ్వు ఆ వేప చెట్టు ఎక్కి కాస్త వేపపువ్వు కోసివ్వు" అన్నారు మా అత్తగారు. మా ఇంటి ముందున్న తాటిచెట్టంత వేప చెట్టు చూపిస్తూ. ఆ మాట విన్న వంటవాడు హడలెత్తిపోతూ "అమ్మో ! ఈ తాటి చెట్టు నే నెక్కలేను తల్లీ ! ఈ వయసుతో ఈలాటి శరీరంతో, నా మోకాళ్ల నొప్పుల్తో — ఇంకేమన్నా ఉందా ! నా వల్లకాదు" అన్నాడు ఏడుపు ముఖంతో.

"అందుకేరా గట్టి పప్పూ, బంగాళాదుంపలూ, ఎక్కువగా తినకరా, వాతం బలిసి ఒళ్లొస్తుందని నీ కెన్నిసార్లు చెప్పాను!

"దానికితోడు నువ్వు ప్రొద్దుటే కాఫీ తాగవాయె. చెంబెడు పాలూ గుటకాయస్వాహా చేస్తుంటివి. మరి దొంద ఒళ్లూ, మోకాళ్ల నొప్పులూ రావూ" అన్నారు మా అత్తగారు.

"పెద్దమ్మగారూ ! తమ రెప్పుడూ నా తిండినే విమర్శిస్తారు. తమతోబాటే తమరు పుచ్చుకున్నన్ని పాలే నేనూ పుచ్చుకుంటున్నాను. టమేటో పప్పూ, బంగాళాదుంపల కూరా చిన్నయ్యగారి కిష్టమని తమరే రోజూ చెయ్యమంటే చేస్తున్నాను. తమరూ అవే భోంచేస్తున్నారు. తమరు తినంగా మిగిలిందే నేను తింటున్నాను. నా కంటూ నేను ఏదీ 'పేషల్'గా చేసుకోవడంలేదుగదా" అంటూ నీళ్లు రాని కండ్లు పై అంగవస్త్రంతో తుడుచుకోబోయాడు.




"సరే సరే. ఆపు నీ సొద! మరి వేప పువ్వు మాటేమిటి? ఎట్లారా ఇప్పుడూ! మన తోట పని వాడు ఈ రోజు పండగని సెలవు పెట్టాడాయె. పదిగంటలపైనగాని మన మేనేజరు రాడు. పైగా పండగాయె. అన్నట్టు ఈ రోజు వస్తాడో, రాడో. ఆ ! ఒక పని చెయ్యరా" అన్నారు మా అత్తగారి కేదో బ్రిలియంట్ ఐడియా తట్టి.

"ఏం చెయ్యమంటారు పెద్దమ్మగారూ !"

"మన పక్కింటి ఆచార్లగారి వేప చెట్టు కొమ్మ మన వెనక డాబా మీదికి వంగింది. నువ్వు మన డాబా పిట్ట గోడ మీది కెక్కి ఆ పక్కింటి వాళ్ల చెట్టు కొమ్మలో వేపపువ్వు కాస్తయినా దొరుకుతుంది స్తోత్రానికి కాస్త కోసివ్వరా" అన్నారు మా అత్తగారు.

ఆమె చెప్పింది విన్న వంటవాడు గాభరాపడిపోతూ "వద్దు పెద్దమ్మగారూ ! వద్దు. మన పక్కింటి ఆచార్లుగారి పెద్దబ్బాయి అసలే దుష్టుడు. మీకు గుర్తుందా. మొన్న వాళ్ల కొబ్బరి చెట్టు ఆకు వంగి మన కారు షెడ్డులోంచి కారు తీస్తుంటే కారు మీదపడి గీరలు పడుతోందని అయ్యగారు దాన్ని కొట్టి వాళ్ల కాంపౌండ్‌లో పడేయమంటే మనతోటవాడు ఆ కొబ్బరాకు వాళ్ల నడక్కుండా కొట్టాడని ఆ దుష్టుడు తక్షణం ఆవేశంతో మన పూల చెట్టు కొమ్మ వాళ్ల పెరట్లో దాకా వెళ్లిందని కత్తి తీసుకొచ్చి సగం చెట్టు నరికేశాడు గదమ్మా. ఇప్పుడు నేను డాబా పిట్టగోడ మీది కెక్కి వాళ్ల ఇంటి వేపచెట్టు కొమ్మ పట్టుకుంటే నా గతీ" అని ఏడుపు ముఖం పెట్టిన వంటవాడికి మా అత్తగారు ధైర్యం చెబుతూ — "పెళ్లాం ఆ వెధవని విడిచిపెట్టిపోయిందనే ఏడుపుతో ఆ కోపం అంతా కక్కుతుంటాండ్రా ఆ గోచీ వెధవ ! ఆ బండ వెధవతో ఏ పెళ్లాం కాపరం చేస్తుందిరా. పదేళ్ల నుంచి చూస్తున్నా. వాడు పంచ కట్టుకున్న పాపాన పోలేదు. జానెడు గోచీతో ఎప్పుడు చూసినా పెరట్లో, గొడ్లల్లో గొడ్డులా తిరుగుతుంటాడు. వాణ్ణి చూసి భయపడుతావేమిటి! పద నీకేం భయంలేదు. కొమ్మ పట్టుకుంటే వాడి సొమ్మేం పోదులే" అంటూ భయంతో వణుకుతున్న వంటవాణ్ణి మెల్లిగా పిట్టగోడ ఎక్కించారు.

వంటవాడు దైవం మీద భారంవేసి తన లావుపాటి శరీరాన్ని అంచెలంచెలుగా పిట్టగోడ మీదికి చేర్చి, డాబా మీద మిల్టరీ ఆఫీసర్ మాదిరి నిలబడ్డ మా అత్తగార్ని వెనక్కి తిరిగి దీనంగా ఒకసారి చూసి తలపైన అందేంత దూరంలో ఉన్నా వేపకొమ్మను ఒడిసిపట్టుకుని గట్టిగా వాటేసుకున్నాడు.

అదే సమయంలో పక్కింటి ఆచార్ల పెద్దకొడుకు గోచీతో వేపపువ్వు కోసం చేతులో కత్తితో అదే చెట్టెక్కాడు. వంటవాడు వాళ్ల వేపచెట్టు కొమ్మను గట్టిగా పట్టుకుని ఉండడం చూసి

కోపంతో తక్షణం చేతిలో ఉన్న కత్తితో, ఆ కొమ్మను నరికాడు.

కత్తివేటుకి సగం తెగిన కొమ్మ వంటవాడి బరువుకి వాళ్ల పెరట్లోకి వంగిపోయింది. వంగిన కొమ్మను పట్టుకుని ఉన్న వంటవాడు వాళ్ల పెరట్లోకీ, మా పిట్ట గోడకీ మధ్య త్రిశంకులా వేళ్లాడుతూ భయంతో గడగడలాడిపోతూ "ఓ పెద్దమ్మగారూ ! నన్ను రక్షించండి. కాపాడండి. ఈ దుర్మార్గుడి చేతులో కత్తి ఉన్నదమ్మా. ఈ దుష్టుడి సంగతి తెలిసీ నన్ను వీడి పాలబడేశారే?" అంటూ వంటవాడు వాపోతూంటే. పక్కింటి దుష్టుడు మండిపడుతూ.


"ఏంటీ ! నేను దుష్టుణ్ణీ, దుర్మార్గుణ్ణీనా ! దొంగతనంగా మా పెరట్లో ఉన్న వేప చెట్టు పువ్వు కోసుకోడానికి వచ్చిన మీరు యోగ్యులా ! ఏం పెద్దమ్మగారూ ! ఇంత వయసొచ్చి మీ కిదేం బుద్ధండీ ! మీ వంటవాడికి దొంగతనం నేర్పారే?"అని పక్కింటి ఆచార్ల గారి దుష్టుడైన పెద్దకొడుకు గట్టిగా కేకలేయడం మొదలెట్టేసరికి, చుట్టుపక్కల ఇండ్లవాళ్లు డాబాల మీది కెక్కి చూట్టం, వింటం మా అత్తగారు చూశారు.

ఇలాంటి సమయాల్లో పరువు కోసం మా అత్తగారు తన తప్పు అమాంతం ఎదుటివాళ్ల మీదికి తోసి తాను తప్పుకోవడం ఆమెకలవాటే గనక.

"ఎవర్రా దొంగతనం నేర్పిందీ ! పెద్దా చిన్నా లేకుండా వాగుతున్నావ్. ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడు గోచీ వెధవా ! ఏదో మా వంటవాడు తెలీక పొరపాట్న మీ వేప చెట్టు కొమ్మ పట్టుకున్నాడు. ఒద్దురా అంటే ఈ బండ వెధవ వింటేనా" అని మా అత్తగారు వంట వాడి మీద అభాండం వేసేసరికి, కొమ్మ పట్టుకుని గబ్బిలంలా వేళ్లాడుతున్న వంటవాడు "అన్యాయం పెద్దమ్మగారూ ! నా మీద అభాండం వేస్తున్నారు. మీరే గదమ్మా వేప పువ్వు కొయ్యమన్నదీ" అని ఆక్రోశంతో అరిచాడు.

"ఛీ ! నోర్మూయ్ ! చాతగాని వెధవా ! నేనెందుకు నిన్ను వెళ్లి వేప పువ్వు పనిగట్టుకుని కొయ్యమంటాన్రా లబోడా వెధవా ! మా ఇంట్లో వేప చెట్టు లేకపోతేగా. లక్షణంగా మా ఇంటి ముందున్న వేప చెట్టు ఆకు కనిపించకుండా వేప పువ్వుతో కళకళ లాడుతూన్న మా చెట్టు విడిచిపెట్టి, పోయి పోయి వీళ్ల మురికి దొడ్లో ఉన్న ఈ వేపచెట్టు పూలు కొయ్యమంటానికి నాకేం ఖర్మరా !" అని మా అత్తగారు చెప్తూంటే అంతా విన్న ఆచార్లగారి రెండో కొడుకు "అవున్రా ! పెద్దామె అమె చెప్పింది నిజమే కదా ! వాళ్లింట్లో ఉందిగా పెద్ద వేప చెట్టు. ఈ వంటాయనే అంత పెద్ద చెట్టు ఎక్కలేక ఈ పని చేసి ఉంటాడు, పోన్లే ! అతను పెద్దవాడు. ఈసారి వదిలెయ్" అని చెప్పి లోపలి కెళ్లాడు.

చుట్టు పక్కల డాబాల మీద నిలబడి విషయం అంతా విన్నవాళ్లు "అయినా ఈ వంటవాని కిదేం పాడుబుద్ధీ ! పైగా ఆ పెద్దామె




కొయ్యమన్నదని అబద్ధాలు చెప్తున్నాడు. మంచి వంటవాడే" అని వంటవాడు సుందరాన్ని తిడుతూ ఎవరి దోవనవాళ్లు ఇళ్లల్లోకి పోయారు.

"హరి హరీ ! నా కేమిటి అపవాదు నాకెందు కీ అవస్థ ! ఒరేయ్ సన్నాసీ ! సన్నొందర్రా. నీకు దణ్ణం పెడతానూ. నన్ను కిందికి దించరా." అది విన్న ఆచార్లు పెద్ద కొడుకు "నిన్ను దించను. పడేస్తాను" అంటూ వేళ్లాడుతున్న మిగతా సగం కొమ్మనూ కత్తితో నరికేశాడు.

పన్నెం డడుగుల ఎత్తు నుంచి వంటవాడు కొమ్మతో సహా కింద ఉన్న గొడ్లు తాగే కుడితి తొట్లో ధప్పున పడ్డాడు. "చచ్చాను బాబోయ్! అని ఒక గావుకేక పెట్టి !

తొట్లోంచి లేవలేక విలవిల లాడుతున్న వంటవాణ్ణి పక్కింటి గోచీవాడే వంటవాడి రెండు చేతులూ పట్టుకుని బయటికి లాగాడు.

ఒంటి నిండా టమెటో. తొక్కలూ, మిరపకాయ తోళ్లు, కొత్తిమీరి, కరివేపాకు, కంచాలు కడిగిన అన్నం మెతుకుల్తో బీభత్సంగా నడుం పట్టుకుని పడుతూ లేస్తూ నడవలేక నడుస్తూ మా ఇంట్లోకి వచ్చిన వంటవాణ్ణి చూసి "ఒరేయ్ అంట్ల వెధవా ! ఏమిట్రా ఈ అవతారం పండగపూటా."

"మీరు కట్టుకున్న పుణ్యమే గదమ్మా !" అన్నాడు హీనస్వరంతో వంటవాడు.

"సరే సరే అదంతా ఇప్పు డెందుకులే. వాగుడు మానేసి వెళ్లి స్నానం చేసి త్వరగా పిల్లలకి టిఫిన్ తయారు చెయ్యి. పిండివంటలూ, వంటా ఏం చేయాలో నే చెప్తా" అని అత్తగారు పురమాయిస్తుంటే —

"ఓ పెద్దమ్మగారూ ! నా వల్లకాదు. ఈ రోజు నే నేమీ చేయలేను. నా వంట్లో ఎముకలన్నీ విరిగినట్లు పోట్లు."

"నీ ఒంట్లో విరగడానికి ఎముక లెక్కడున్నాయిరా. నీ ఒంటినిండా కండలేగా ఉండేది!"

"పెద్దమ్మగారూ ! మీ దిష్టితోనే నా శరీరానికి ఈ గతి పట్టింది. ఆ దుర్మార్గుడు కొమ్మ నరికినప్పుడు కింద కుడితి తొట్టిలో పడబట్టి బ్రతికాను."

"లేకపోతే ఏమయ్యేదిరా. కింద పేర్చి ఉన్న ఇటికల మీద పడేవాడివి. అంతేగా ఇటికలేగాని బండరాళ్లు కావుగా? దొంగ వేషాలెయ్యకుండా త్వరగా స్నానం చేసి వంట పని, చూడు."

"అమ్మో నా వల్లకాదు. నన్ను మీరు పనిలో నుంచి తీసివేసినా పర్వాలేదు. నా నడుం పట్టేసింది. నే నేపనీ చేయలేదు. మీ ఇష్టం. నే పోయి డాక్టర్‌కి చూపి ఈ నొప్పులకి మందేదైనా ఇస్తాడేమో వేసుకొనొస్తా" అంటూ వంటవాడు స్నానానికి పెరట్లో ఉన్న బావి దగ్గరకి మెల్లిగా వెళ్లాడు.

"హోరి నీ తాడు తెగా. పండగనాడే నీ నడుం పట్టుకుపోవాలా. సరే ఈ పూటకి వంట నే చెయ్యాలన్నమాట. సరే. ముందు పిల్లలకి టిఫిన్ చేయాలి" అంటూ హడావిడిగా వంటింటి వేపు వెళ్తున్న మా అత్తగార్తో పిల్లవాడు 'నో' నానమ్మా ! అంకుల్తో మేము బ్రెడ్, బటర్, జామ్ తినేశాం. 'నో' టిఫిన్ 'నో' భోజనం ఈ రోజు మనింట్లో. మేము మా ఫ్రెండ్స్ ఇండ్లకి భోజనానికి వెళ్తున్నాం. పాపం వంటవాడిని డాక్టర్ దగ్గరకు పోయిరానీ పూర్ ఫెలో !" అన్నాడు మా అబ్బాయి.

"అయితే నా ఒక్కదానికేనా వంటా? హయ్యో నా తల్రాతా! ఈ ఏడాది అరవ సంవత్సరాది అరువు భోజనాలు పెట్టిస్తోందన్నమాట !" అంటూ వంటింటి వేపు నీరసంగా వెళ్లారు మా అత్తగారు.

●